క్లుప్తంగా

వీధి దీపాలకు స్కైమెన్ లిఫ్ట్ వాహనం



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీధి దీపాల కోసం నగరపాలక సంస్థ స్కైమెన్ లిఫ్ట్ వాహనాన్ని కొనుగోలు చేసిందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వీధి దీపాలను అమర్చడానికి, మరమ్మతులు చేయడానికి సులభతరంలో చేసే స్కై మెన్ లిఫ్ట్ వాహనాన్ని ఒక్కొక్కటి రూ. 58.5 లక్షల చొప్పున రెండు వాహనాలను రూ.1.17 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి కొనుగోలు చేశామన్నారు. ఈ వాహనం హైమాస్ట్ లైట్స్, ప్రధాన రహదారులు, జాతీయ రహదారుల్లో ఉన్న వీధి దీపాలను అమర్చడం లేదా మరమ్మతులు చేస్తామని తెలిపారు.

లెనినిజం అజేయం

సాక్షి, అమరావతి: లెనినిజం అజేయమని.. పెట్టుబడిదారీ వ్యవస్థ, దోపిడీదారులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలకు సోషలిస్టు రాజ్యనిర్మాత వీఐ లెనిన్ స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. వీఐ లెనిన్ శత వర్ధంతి ముగింపు (101) సందర్భంగా మంగళవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహానికి వామపక్ష పార్టీల నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తరతరాల మానవ జాతికి లెనిన్ స్ఫూర్తిదాయకమని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, విశ్రాంత ఆచార్యులు నరసింహారావు, ఎస్‌యూసీఐ నాయకులు అమర్‌నాథ్, ముప్పాళ్ల భార్గవశ్రీ, ఇఫ్టూ కార్యదర్శి పోలారి, జి.కోటేశ్వరరావు, బుడ్డిగ జమీందార్, సీహెచ్.బాబూరావు, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సునీతకు కృష్ణంరాజు ప్రతిభ సేవా పురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంకు చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు, మారుతీ మహిళా సొసైటీ డైరెక్టర్ లఖంరాజు సునీతకు హైదరాబాద్‌కు చెందిన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ రెబల్ స్టార్ కృష్ణంరాజు ప్రతిభా సేవా పురస్కారం ప్రదానం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కృష్ణంరాజు జయంతి వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, రుద్రరాజు పద్మరాజు తదితరుల చేతుల మీదుగా సునీత పురస్కారం అందుకున్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): బర్మాకాలనీ, రాధానగర్, అపార్టుమెంట్లు ప్రాంతాల్లోని ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ తాగునీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజినీరు శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సూపరింటెండెంట్ ఇంజినీరు సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాసరెడ్డిలతో కలిసి బర్మాకాలనీ, రాధానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సరఫరా సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక పైపు లైను నిర్మాణానికి చర్యలు తీసుకొంటామని అధికారులు తెలిపారు. డీఈ లక్ష్మీసింధూర, ఏఈ మాధవ్, వైఎస్సార్ సీపీ సీపీ నాయకుడు యరగొర్ల శ్రీరాములు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణరాజు



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శిగా విజయవాడకు చెందిన పెనుమత్స సత్యనారాయణరాజు ఎన్నికయ్యారు. వరుసగా రెండో దఫా సంఘ కార్యదర్శిగా ఎన్నికైన సత్యనారాయణరాజును కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.వంశీకృష్ణప్రసాద్, సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఇందిరాగాంధీ స్టేడియంలోని ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం అభినందించారు.

ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో తనపై దాడి చేశారంటూ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు మధురానగర్‌కు చెందిన షేక్ రాజా తన ఆర్థిక అవసరాల నిమిత్తం బుల్లెట్, యాక్టీవాను షేక్ ఖాదర్ భాషా వద్ద రూ. 1.5 లక్షలకు తాకట్టు పెట్టారు. ఈ వ్యవహారంలో ఇరువురికి గొడవలు జరుగుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో రాజా తన స్నేహితుడితో మధురానగర్ నేతాజీకాలనీకి వెళ్లారు. ఈ క్రమంలో ఖాదర్ భాషా రాజాను వెనుక నుంచి వచ్చి దాడి చేశారు. గాయపడిన రాజా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనధికారిక పార్కింగ్‌తో పరేషాన్

- జీఎస్ రాజు రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు
- రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు
- పట్టించుకోని ట్రాఫిక్, టౌన్‌ప్లానింగ్ అధికారులు



జీఎస్ రాజు రోడ్డులో అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సత్యనారాయణపురం, జీఎస్ రాజు రోడ్డులో కొంత మంది స్థానికులు రోజుల తరబడి కార్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేయడంతో పాటుగా కొందరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. దీన్ని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని స్థానికులు, పలువురు వాహనదారులు వాపోతున్నారు.

పార్కింగ్ సదుపాయం లేదు

బస్‌స్టేషన్ నుంచి నూజివీడు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలతో జీఎస్ రాజు రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులోనే ఇరిగేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్, దేవాలయాలు, రైతుబజార్‌తో పాటు పలు ప్రైవేటు కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో దాదాపుగా ఏ ఒక్కదానికి పార్కింగ్ సదుపాయం లేదు. దీంతో అక్కడికి వచ్చే ప్రజలు, వినియోగదారులు తమ వాహనాలను జీఎస్ రాజు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ఈ రోడ్డులో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.

రోజుల తరబడి రోడ్డుపైనే వాహనాలు

సత్యనారాయణపురం సమీపంలోని నివాసితులు కూడా వారి ఇళ్ల వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోజుల తరబడి తమ వాహనాలను జీఎస్ రాజు రోడ్డులోనే అనధికారికంగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రతిరోజూ అటుగానే రాకపోకలు సాగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తరచూ నెలకొంటోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట అడ్డదిడ్డంగా పార్కింగ్



రోడ్డుపై బీరువాల తయారీ, వెల్డింగ్ పనులు చేస్తున్న వ్యాపారులు

రోడ్లపైనే వ్యాపారాలు

ప్రతిరోజూ వేలాది వాహనాలతో రద్దీగా ఉండే జీఎస్ రాజు రోడ్డులో కొంత మంది వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ముఖ్యంగా బీరువాల తయారీ, వెల్డింగ్ షాపు నిర్వాహకులు రోడ్డుపైనే అడ్డంగా తమ పనులు చేసుకోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వీటిపై దృష్టిపెట్టి అనధికారి పార్కింగ్, రోడ్డుపై వ్యాపారాలను కట్టడి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కుంగ్‌ఫూ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



గురుకుల కళాశాలలో కుంగ్‌ఫూ శిక్షణ కార్యక్రమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుంగ్‌ఫూ వంటి కళలను నిత్యం సాధన చేయడం వల్ల విద్యార్థులు శారీరకంగానూ, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటారని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అన్నారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం కుంగ్‌ఫూ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు అందరూ ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ కోర్సులు విధిగా నేర్చుకోవాలని సూచించారు. ఇక్కడ మూడు నెలల పాటు కుంగ్‌ఫూ శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కుంగ్‌ఫూ శిక్షకుడు అబ్దుల్ బాసిత్ విద్యార్థులు, అధ్యాపకులు ఒత్తిడిని తగ్గించుకోడానికి సులువైన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఏలూరు రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, శివాలయం రోడ్డు, ప్రకాశం రోడ్డు, దూబగుంటవారి వీధి, మేరీ వీధి, అట్లూరత్తయ్య వీధి, మసీదు, ఖాజాపున్నయ్య వీధి, గోపాల్‌రెడ్డి రోడ్డు, గోపువారి వీధి, తాడంకివారి వీధి, మమత హోటల్ రోడ్డు, పాత బస్టాండ్, ఏలూరు రోడ్డు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

టీజీ రాజ్యలక్ష్మికి డాక్టరేట్

మధురానగర్(విజయవాడసంట్రల్): ఆధ్యాత్మిక ప్రవచకురాలు టీజీ రాజ్యలక్ష్మి నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తిరుప్పల్లాండు తమిళ ప్రబంధం తెలుగులో చేసిన పరిశోధనలకుగానూ డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఉప్పలూరి భారతీమాత పుస్తకావిష్కరణ



ఉప్పలూరి భారతీ మాత పుస్తక ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉప్పలూరి భారతీమాత జయంతి పురస్కరించుకుని ఉప్పలూరి లక్ష్మీనారాయణ రచించిన నోముల తల్లి ఉప్పలూరి భారతీమాత పుస్తకం ఆవిష్కరించారు. ముత్యాలంపాడు మారుతీగ్యాస్ కంపెనీలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, చెట్లపల్లి మారుతీప్రసన్న ఆధ్వర్యాన మంగళవారం నోముల తల్లి ఉప్పలూరి భారతీమాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రచయిత ఉప్పలూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారతీమాత గుణ గణాలు, నిత్య పూజలు, నిరంతర నోముల గురించి అందరికీ తెలియజేసేందుకు తాను పుస్తకం రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బీ వసంతకుమార్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ డీఈ ఎస్ నాగేశ్వరరావు, సావిత్రి గౌరీమాత, కాల్వ కరుణ కుమారి, పీ జానకి, రోజా, దివాకర్ల విజయలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలిండియా రేడియో విజయవాడ విశ్రాంత చీఫ్ అనౌన్సర్ మాడుగుల రామకృష్ణ పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కే డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గాయకులు సుశీల్‌కుమార్, శ్యాం ప్రసాద్, జయప్రభ, అయ్యప్పన్, మల్లాది స్వాతి, భారతి, మల్లీశ్వరి, షబానా తదితరులు పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమ నిర్వాహకుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం దాసరి కళాపీఠం గౌరవ అధ్యక్షుడు మూర్తి రాజును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

దర్జాగా కబ్జా

- రూ. 2 కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలం
- భూమి పూజ చేస్తుండగా అడ్డుకున్న అధికారులు



63వ డివిజన్ సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న వీఎంసీ స్థలం

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. స్థానిక 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లో సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న సుమారు రూ. 2 కోట్లు విలువ చేసే 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎలాగైన జాగాను తమ సొంతం చేసుకునేందుకు దొంగ డాక్యుమెంట్లు పుట్టిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సుమారు 34 ఏళ్ల క్రితం ఇళ్లు లేని పేదలకు 72 గజాల చొప్పున ఐదు ప్లాట్లు రాజీవ్‌నగర్ ప్రాంతంలో పంపిణీ చేసింది. స్థానికుల అవసరాల నిమిత్తం కామన్‌గా మరి కొంత స్థలం వదిలివేయడం జరిగింది. ఇది మొత్తం 500 గజాలు. అయితే స్థానికంగా ఉన్న కొందరు ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని కబ్జా చేసి దొంగ డాక్యుమెంట్లు పుట్టించారు. అయితే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది ఇది వీఎంసీ స్థలం అని.. ఆక్రమించరాదని బోర్డు పెట్టించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు.

అదును చూసి ఆక్రమణ

గత కొన్ని రోజులుగా సంక్రాంతి పండుగ సెలవుల్లో అధికారులుండగా అధికార పార్టీ నాయకులు ఫెన్సింగ్ తొలగించి ఈ స్థలం మాదేనని జేసీబీతో చదును చేయించారు. మంగళవారం డివిజన్ టీడీపీ నాయకులు స్థలంలో పసుపునీళ్లు చల్లి భూమిపూజ చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంతం ఇన్‌చార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ప్లానింగ్ సెక్రటరీ స్వర్ణతేజస్విని వచ్చి అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలం వద్ద ఎలాంటి పనులు చేపట్టవద్దని తేల్చి చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు స్థానికులు కూడా జోక్యం చేసుకోవడంతో ఉన్నతాధికారులతోనే మాట్లాడతామని చెప్పి నాయకులు వెళ్లిపోయారు. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారి కృష్ణబాబును వివరణ కోరగా ఈ ప్లాట్లు ఎలాట్‌మెంట్ విషయం, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విచారణ చేసిన తర్వాత ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేదల ఇళ్లపై కూటమి ప్రభుత్వం కుట్ర

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



నున్న జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల ఇళ్లపై కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. నున్న, సూరంపల్లిలోని జగనన్న లేఅవుట్లను మంగళవారం ఆయన సందర్శించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. తాగునీరు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గృహ యజమానులు ఆయన వద్ద వాపోయారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుపేదల సొంతింటి కల సాకారం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాలనీల పేరుతో ఏకంగా మినీ సిటీలనే నిర్మించిందని గుర్తుచేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా 31.70 లక్షల ఇళ్లపట్టాలను అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు వివరించారు. అలాగే ఇళ్ల నిర్మాణానికి రూ. 1.80 లక్షల సాయం అందించినట్లు చెప్పారు. ఒక్క విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే 23,490 మందికి ఇంటి స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. కాగా కూటమి పెద్దలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పటివరకు ఒక్కరికి కూడా సెంటు స్థలం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతిలో నిర్లక్ష్యంగా పేదల ఇళ్ల నిర్మాణాలను నిలిపివేసిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, యరగొర్ల శ్రీరాములు, మేడా రమేష్, జగదీష్, పఠాన్, నాగూర్, సయ్యద్ ముస్తఫా, షేక్ షేర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల విస్తరణకు సకాలంలో భూసేకరణ

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో చేపట్టబోయే జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ పనులను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు వివరించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎ. కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద రహదారి విస్తరణ, అభివృద్ధికి భూసేకరణ, నందిగామ వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వెహికల్ అండర్ పాస్ నిర్మాణం చేయడం జరిగిందని, దానికి అనుసంధానంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావచ్చిందని తెలిపారు. అలాగే విజయవాడ బెంజ్ సర్కిల్ నుంచి జాతీయ రహదారికి ఇరువైపుల సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులో డ్రెయిన్ల నిర్మాణ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, కలెక్టర్ కార్యాలయ భూసేకరణ పర్యవేక్షకుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి సావిత్రికి అమ్ముల స్మారక పురస్కారం



జయంతి సావిత్రికి అమ్ముల విశ్వనాథ భాగవతార్ స్మారక పురస్కారం ప్రదానం చేసిన నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: విఖ్యాత హరికథా భాగవతార్ అమ్ముల విశ్వనాథం పేరిట ప్రదానం చేసే విశ్వనాథ స్ఫూర్తి పురస్కారాన్ని 2025 సంవత్సరానికిగానూ తిరుపతికి చెందిన భాగవతారిణి జయంతి సావిత్రికి దుర్గాపురంలోని సంగీత కళాశాలలో మంగళవారం ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ అమ్ముల విశ్వనాథ భాగవతార్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి హరికథ వైభవాన్ని ప్రచారం చేసినట్లు తెలిపారు. అనంతరం జయంతి సావిత్రికి స్మారక పురస్కాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జయంతి సావిత్రి భక్త మార్కండేయ హరికథను గానం చేశారు. కవి వసుధ బసవేశ్వరరావు, అమ్ముల ప్రసాద్, బీవీ దుర్గాభవాని, భాస్కర సతీష్ పాల్గొన్నారు.

• 'గణతంత్ర' ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలకు ఇందిరాగాంధీ స్టేడియం ముస్తాబవుతోంది. 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా పోలీస్ పరేడ్ రిహార్సల్స్ చేస్తున్నారు. వేడుకలకు శకటాలు సిద్ధమవుతున్నాయి. స్టేడియం ప్రాంగణాన్ని మువ్వన్నెల జెండాలతో ముస్తాబు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ













• మంచు దుప్పటి





నగరాన్ని మంగళవారం ఉదయం మంచుదుప్పటి కప్పేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు కురిసింది. ప్రజలు బయటకు వస్తే గజగజ వణికిపోయారు. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అలాగే కృష్ణానదిలో మంచులోనే చేపలవేట చేస్తూ మత్స్యకారులు కనిపించారు. కొందరు వీధుల్లో చలిమంటలు వేసుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు నిర్వహించారు.